క్లుప్తంగా

శివాలయంలో యాగశాల ప్రారంభం



యాగశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక శివాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన యాగశాలను వేదపండితులు అందుకూరి ప్రభాకరశాస్త్రి వేద మంత్రోచ్చరణల నడుమ బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించిన రుద్ర హోమం, రుద్రాభిషేక పూజల్లో యాగశాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన లోకేష్, దేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు చుక్క రామునాయుడు, పైల సన్యాసిరావు, పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పోతల అప్పలనాయుడు, చుక్క గోపి, గండి శ్రీనివాసరావు, గండి రామకృష్ణ, గండి వెంకటరావు, బండారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దారప్ప మృతి



దారప్ప మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: చినముషిడివాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముచ్చకర్ల దారప్ప అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా దారప్ప అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, మరణించారు. దారప్ప మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకులు బయిలపూడి భగవాన్ జయరామ్, మెంటి మహేష్, చిరికి దేముడు, నక్కా మహేష్, మెంటి సూరిబాబు నివాళి అర్పించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- పావు తులం బంగారం, వెండి, నగదు స్వాధీనం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి పల్లినారాయణపురం చోరీ కేసులో నిందితుడ్ని పెందుర్తి క్రైం విభాగం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ జోన్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు. ఈ నెల 24న ప్రహ్లాదపురం సమీపంలోని పల్లినారాయణపురంలో లేబర్ మేస్త్రీగా పనిచేస్తున్న బాలి కృష్ణ ఇంటిలోకి చొరబడిన దుండగులు బీరువాలోని పావు తులం బంగారు చెవి రింగులు, 10 తులాల వెండి పట్టీలు, రూ.15 వేల నగదు తస్కరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్ఐ సూరిబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు నిందితుడు దున్న శేఖర్ సుజాతనగర్ ప్రాంతంలో తిరుగుతుండగా మాటువేసిన పోలీసులు అతడ్ని పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నిబంధనలు వద్దు.. అమ్మకాలే ముద్దు

ఉన్నవి రెండు రోజులే.. వాతావరణం అనుకూలంగా ఉండటంతో రూ.లక్షల్లో బాణసంచా సామగ్రి తెప్పించాం. అసోసియేషన్ కనుసన్నల్లోనే దుకాణాల నిర్వహణ. కనీస భద్రత నిబంధనలు పాటించలేదని పోలీసులు దుకాణాలు తెరిచేందుకు అంగీకరించలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోవట్లేదు.. ఇదీ బుధవారం పెందుర్తి నూకాలమ్మ దేవాలయ సమీపంలో బాణసంచా దుకాణం ఏర్పాటు చేసిన, ఓ వర్తకుని గోడు.

బాణసంచా విక్రయాలకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేశాం. భద్రత, ప్రమాద నియంత్రణ పరికరాల ఏర్పాటుపై ముందుగానే హెచ్చరించాం. అయినా స్టాళ్ల నిర్వాహకులు దాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే అనుమతులు ఇచ్చిన మమ్మల్నే ప్రతి ఒక్కరూ నిందిస్తారు. అనుకోని సంఘటన జరిగి, ప్రాణ నష్టం వాటిల్లితే, ఆ తర్వాత బాధపడి మాత్రం ప్రయోజనమేంటని.. పోలీసుల వాదన.

- పెందుర్తి కూడలి వద్ద నిబంధనలు పాటించని దుకాణదారులు
- రోజంతా అడ్డుకున్న పోలీసులు
- కూటమి నేతల ఒత్తిడితో రాత్రి నుంచి అమ్మకాలు
- పాపయ్యరాజుపాలెంలోనూ అదే పరిస్థితి



పెందుర్తిలో పోలీసులపై ఒత్తిడి తెస్తున్న దుకాణాల యజమానులు



పాపయ్యరాజుపాలెంలో దుకాణాలను పరిశీలిస్తున్న డీసీపీ-2 మేరీకుమారి

పెందుర్తి: దీపావళి బాణసంచా సామగ్రి అమ్మకాలపై పెందుర్తి ప్రాంతంలో అధికారులకు, కూటమి నేతలకు మధ్య హైడ్రామా నడిచింది. బుధవారం సాయంత్రం వరకూ అమ్మకాలకు ఆటంకం ఏర్పడింది. అధికారులు వర్సెస్ కూటమి నేతలు అన్న రీతిలో రగడ కొనసాగింది. ప్రధానంగా పెందుర్తి కూడలి వద్ద నూకాలమ్మ దేవాలయం సమీపంలో దుకాణాల ఏర్పాటులో కనీస నిబంధనలు పాటించకపోవడంతో అక్కడ అమ్మకాలను పోలీసులు అడ్డుకున్నారు. కూటమికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే తీవ్రమైన ఒత్తిడి తీసుకురాగా పోలీసులు తలొగ్గారు. దీంతో సాయంత్రం పొద్దుపోయాక అమ్మకాలు ప్రారంభించారు.

నిబంధనలపై నిర్లక్ష్యం

పాపయ్యరాజుపాలెంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఉన్నప్పటికీ తగిన ప్రాథమిక భద్రత చర్యలు చేపట్టకపోవడంలో పోలీసులు అమ్మకాలను పలుమార్లు అడ్డుకున్నారు. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తరువాతే అమ్మకాలు సాగించాలని యజమానులకు తేల్చి చెప్పారు. దీంతో సాయంత్రం వరకు ఇక్కడ అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసులు ఎంతగా మొత్తుకున్నా.. దుకాణాల వద్ద పాటించాల్సిన నిబంధనలపై మాత్రం దుకాణదారులు దృష్టిసారించలేదు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ప్రాణ నష్టం అంచనాకు అందదని హెచ్చరించినా.. కూటమి నేతల ద్వారా పోలీసుల నోళ్లు మూయించేందుకే ప్రయత్నించారు. చివరికి తూతూ మంత్రంగా ఇసుక, నీళ్ల తొట్టెల్ని ఏర్పాటు చేసి మమ అనిపించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: మేరీకుమారి, డీసీపీ-2

బాణాసంచా దుకాణాల వద్ద అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, లేకుంటే యజమానులపై కఠిన చర్యలు తప్పవని డీసీపీ-2 డి.మేరీకుమారి హెచ్చరించారు. బుధవారం పెందుర్తి, పాపయ్యరాజుపాలెంలోని బాణాసంచా దుకాణాల సముదాయాలను ఆమె సందర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్న దుకాణాల్లో అమ్మకాలు తక్షణమే నిలిపేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితిలోనూ నిబంధనలు పాటించని దుకాణాల్లో అమ్మకాలు జరగనీయొద్దంటూ పోలీసులను సూచించారు. డీసీపీ-2 వెంట ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ కె.వి.సతీష్‌కుమార్, ఎస్ఐలు రెడ్డి ఆసిరి తాత, స్వామినాయుడు ఉన్నారు.

రక్షణ లేని తుపాను రక్షిత భవనం



రక్షణ గోడ లేని తుపాను షెల్టర్

పరవాడ: విపత్తుల సమయంలో మత్స్యకార్మికుల రక్షణార్థంముత్యాలమ్మపాలెం తీరంలో నిర్మించిన తుపాను షెల్టర్ చుట్టూ రక్షణ గోడ లేక షెల్టరు మరమ్మతులకు గురైంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన తుపాను షెల్టర్లో బాధితులకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు చేసినా, దీని చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా ఈ భవనాన్ని స్థానికులు ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. మద్య సేవనం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చేశారు. చుట్టూ ప్రహరీ రక్షణ లేకపోవడంతో వేట సామగ్రి, వంట చెరకు నిల్వకు వినియోగిస్తున్నారు. దీంతో భవనం చెత్తాచెదారంతో నిండి, అధ్వానంగా తయారైంది. భవనం ఆలనాపాలనా చూసే నాథుడు లేక మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, కిటికీలు, అద్దాలు, తలుపులు పాడయ్యాయి. భవనానికి అమర్చిన స్విచ్ బోర్డులు, బల్బులు, ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు స్పందించి భవనం చుట్టూ పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాడవాడలా దీపావళి సందడి



మట్టి ప్రమిదల కొనుగోలు

- మట్టి ప్రమిదలు, బాణసంచా దుకాణాల వద్ద కోలాహలం



సుజాతనగర్ రవీంద్రభారతి స్కూల్లో దీపావళి వేడుకలో విద్యార్థులు

సింహాచలం: 98వ వార్డు అడవివరంలో దీపావళి సామాన్ల విక్రయాలు, కొనుగోళ్లతో బుధవారం సందడి నెలకొంది. అడవివరంలోని కుమ్మరిదిబ్బ, మార్కెట్ ఏరియాల్లో మట్టి ప్రమిదల దుకాణాలు వెలిశాయి. పాత అడవివరం కూడలిలో బాణసంచా దుకాణాల వద్ద కోలాహలం మొదలయింది. ఉదయం నుంచి రాత్రి వరకు చిన్నా, పెద్ద తేడాలేకుండా అధిక సంఖ్యలో గ్రామస్తులు షాపులకు వెళ్లి, తమకు నచ్చిన సామగ్రి కొనుగోలు చేశారు. మార్కెట్ కూడలిలో ఉన్న పూల దుకాణాలు వద్ద మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఇంటింటా దీపావళి పండగనాడు లక్ష్మీదేవి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

పెందుర్తి: సుజాతనగర్లోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు దీపాలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వెలిగించి సందడి చేశారు. ప్రిన్సిపాల్ స్వరూప మాట్లాడుతూ ఇళ్ల వద్ద చిన్నారులు మందుగుండు సామగ్రి కాల్చేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉంటాన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ విశాఖ పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ నుంచి అమరవీరుల స్మృతి స్థూపం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు మనం ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, మన నగరం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని పతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ (లా అండ్ ఆర్డర్) అజిత వేజెండ్ల, జాయింట్ సీపీ(ఇన్‌చార్జ్) డీసీపీ-2 డి.మేరి ప్రశాంతి, నగర ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల చేయాలి

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించి సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఈ నెల 28 నాటికే సీనియారిటీ జాబితాలను బహిర్గతం చేయాల్సి ఉండగా.. డీఈవో కార్యాలయ అధికారులు తీవ్ర తాత్సారం చేయడం సరికాదన్నారు. అభ్యంతరాల స్వీకరణకు తుది గడువుగా నవంబర్ 1 అని పేర్కొనడం జరిగిందని, సీనియారిటీ జాబితాలే ప్రకటించకుంటే, ఉపాధ్యాయులు వాటిని ఎలా పరిశీలించుకుంటారని ప్రశ్నించారు. సీనియారిటీ జాబితా విడుదల చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, సీనియర్ నాయకులు బి.జనార్దన్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, గౌరవాధ్యక్షులు ఎస్.ప్రసాద్, శేఖర్, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచాతో బహు జాగ్రత్త



డి.సత్యరాజు

సబ్బవరం: దీపావళి వస్తోందంటే పిల్లల నుంచి పెద్దల వరకూ ఒకటే సందడి. బాణసంచా వెలుగుల్లా జీవితం శోభిల్లాలని ఆకాంక్షిస్తారు. ఆ సంబరాన్ని అంబరాన్ని తాకేలా టపాసులు కాల్చి ఆనందిస్తారు. ఆ ఆనందంలో అజాగ్రత్తగా ఉంటే అనుకోని ప్రమాదాలు జరిగి, జీవితం అంధకారమవుతుందని సబ్బవరం అగ్నిమాపక కేంద్రం అధికారి డి.సత్యరాజు హెచ్చరిస్తున్నారు. అగ్ని ప్రమాదం వాటిల్లితే 101, 112, 100, 1070 నంబర్లను సంప్రదించాలన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ బాణసంచా కాల్చేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఆయన మాటల్లోనే..

చేయాల్సినవి..

- లైసెన్స్ పొందిన, నాణ్యమైన టపాసులు అమ్మేవారి నుంచి మాత్రమే టపాసులు కొనుగోలు చేయాలి.
- భవనాలు, వాహనాలు, మండే పదార్థాలకు దూరంగా పార్కులు, మైదానం వంటి బహిరంగ ప్రదేశాలలోనే టపాసులు పేల్చాలి.
- అందుబాటులో బకెట్‌తో నీటిని ఉంచుకోవాలి.
- సింథటిక్ దుస్తులకు మంటలు వేగంగా అంటుకునే స్వభావం ఉంది. వదులుగా ఉండే కాటన్ దుస్తుల్ని మాత్రమే ధరించాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చేలా చూడాలి.
- క్రాకర్స్ కాల్చాక వాటిని నీటితో ఉన్న ప్రత్యేక బకెట్‌లో పారేయండి.
- ఒకటి కంటే మించిన టపాసుల్ని ఒకేసారి కాల్చడం మానాలి.
- ఇళ్లు, వ్యక్తుల పైకి దూసుకొచ్చే అవకాశం లేకుండా గాలి దిశను గమనించండి.

చేయకూడనివి

- ఇంటి లోపల, కిటికీల దగ్గర, ఇరుకు ప్రదేశాల్లో బాణసంచా కాల్చొద్దు.
- ఎండు ఆకులు, గ్యాస్ సిలిండర్లు వద్ద బాణసంచా పేల్చడం ప్రమాదం.
- పేలని టపాసుల్ని మళ్లీ కాల్చేందుకు ప్రయత్నించవద్దు.
- అగ్ని ప్రమాదం సంభవించినపుడు తప్పించుకునేందుకు వీలయ్యే మార్గాల్లో టపాసులు కాల్చవద్దు.
- నూనె దీపాలు, కొవ్వొత్తుల్ని కర్టెన్లు, మండే పదార్థాల వద్ద ఉంచవద్దు.
- ఏదైనా గాయం తగిలితే వెంటనే వైద్యుని సంప్రదించండి.

బాణసంచా స్టాళ్ల నిర్వాహకులపై డీఎస్పీ ఆగ్రహం



సబ్బవరంలో స్టాళ్ల యజమానుల లైసెన్స్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల యజమానులపై పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి ఆయన చోడవరం రోడ్డులో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాల్‌కి స్టాల్‌కి మధ్య నిర్దేశించిన దూరం పాటించకపోవడం ఆగ్రహించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకుల లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పరవాడ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 150 బాణసంచా స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సబ్బవరం మండలంలో 20 స్టాళ్లకు అనుమతులు ఇచ్చామన్నారు. స్టాల్‌కి స్టాల్‌కి మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండాలని, డ్రమ్ములతో నీటిని, ఇసుక మూటలు వంటి అగ్నిమాపక జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి స్టాల్స్ యజమానులకు తగిన సలహాలు, సూచనలు అందించామన్నారు. ప్రజలంతా దీపావళి పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం నమోదు చేయిస్తున్న దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు సిద్ధార్థనగర్, కార్మిక నగర్ ప్రాంతాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలను నమోదు చేయించారు. ఆయా కాలనీల ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.







LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన సమృద్ధి, కొత్త ఇన్వెస్ట్‌మెంట్ బిల్డింగ్, ఎల్ఐసి ఎక్స్ బిల్డింగ్, శిఖన్న రోడ్, విశాఖపట్నం-530004. ఫోన్: 0891-2746480, 2957322

(రూల్ 8(1)) **స్వాధీనతా ప్రకటన**

సెక్షన్ 13(4) క్రింద సర్ఫేసి యాక్ట్, 2002 లోన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002లో చట్టం 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి (రూల్ 3తో చదివే) సెక్షన్ 13(12) ప్రకారం [illegible] LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు [illegible] రూ.29,27,071.21 పై [illegible] + తేది.13.08.2021 నుండి [illegible] తేది.12..08.2024 న డిమాండ్ నోటీసును జారీ చేసినారు. లోన్ ఖాతా నెం. 711500012757, ఏరియా ఆఫీస్ : విశాఖపట్నం.

[illegible] సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో [illegible] LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., [illegible] తేది.25.10.2024 న [illegible]

[illegible] తేది.12.08.2024 నాటికి రూ.29,27,071.21 పై [illegible] + తేది.13.08.2024 నుండి [illegible] LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible]

స్థిరాస్తి వివరములు

[illegible] తేది.21.06.2021 న [illegible] నెం.1725/2021 [illegible] విశాఖపట్నం జిల్లా, గోపాలపట్నం ఎస్.ఆర్.ఓ పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, [illegible] సర్వే నెం.30/2బి & 30/3 [illegible] 1405.38.33 [illegible] 43.74 [illegible] 30.572 [illegible] 787.50 [illegible] 202.50 [illegible] 1050 [illegible] ఫ్లాట్ నెం.202 మరియు 84 [illegible] సర్వే నెం.30/1 [illegible] ఫ్లాట్ నెం.202 [illegible]

[illegible] తేది.25.10.2024 న [illegible]

తేది : 25.10.2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి,
LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. సబ్బవరం మేజర్ పంచాయతీలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి, పలు భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సబ్బవరంలో నిర్వహించిన రీ సర్వేలో చాలా మంది రైతులకు 1బీ, పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వలేదని, దీనిపై పరిశీలించాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల కేంద్రంలో ఆర్ అండ్ బీ రోడ్లు, సీసీ డ్రైన్లు సైతం ఆక్రమణకు గురయ్యాయని, దీంతో వర్షం నీరు, మురుగునీరు రోడ్లుపై ప్రవహించి మురికి కూపాలుగా తయారైనట్లు స్థానిక రైతు కోరాడ శ్రీను ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలిగించాలని తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగిస్తామని, అవసరమైతే ఆక్రమణదారులపై భూ ఆక్రమణ కేసులు నమోదు చేస్తామన్నారు. పలు రెవెన్యూ సమస్యలపై రైతుల నుంచి 74 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. సదస్సులో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, రీ సర్వే డీటీ గణేష్, మండల సర్వేయర్ లాలం అప్పారావు, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, గొర్లి చైతన్య, కొటాన అప్పారావు, పల్లా తాతారావు, కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శివ పూజకు సన్నద్ధం



సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి



విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

- 2వ తేదీ నుంచి కార్తీకమాసం
- ముస్తాబవుతున్న శివాలయాలు

సింహాచలం: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. వచ్చే నెల 2 నుంచి కార్తీక మాస పూజలకు సన్నాహాలు మొదలయ్యాయి. సింహగిరిపైన, 98వ వార్డులోని శివాలయాల్లో కార్తీకం నెల రోజులూ విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శివుడిని భక్తిశ్రద్ధలతో భక్తిశ్రద్ధలతో పూజించేందుకు, అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

- సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీకమాసం పూజలను విశేషంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు రమణమూర్తి తెలిపారు. ప్రతీరోజు ఉదయం 5గంటల నుంచి 11 గంటల వరకు స్వామికి అభిషేకాలుంటాయన్నారు. శుక్రవారం సాయంత్రం ఆకాశదీప మహోత్సవం జరగనుందన్నారు.
- సింహగిరి పైనున్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నెలరోజులు స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- అడవివరంలోని శివాలయాల్లో శనివారం నుంచి పరమేశ్వరుడికి విశేషంగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, పాత అడవివరం ,కుమ్మరిదిబ్బ ప్రాంతాల్లోని శివాలయాల్లో నెలరోజులపాటు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కొలువైన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. శనివారం ఉదయం 4.30 గంటలకు శ్రీ సిద్ధి వినాయకస్వామికి అభిషేకంతో కార్తీకమాసం పూజలు ప్రారంభించనున్నారు. రోజూ ఉదయం అభిషేకాలు, సాయంత్రం ఆకాశదీపోత్సవం, సోమవారాల్లో ఓం నమఃశివాయ స్తోత్ర పారాయణం, ఏకవారాభిషేకాలు నిర్వహించనున్నారు.

